## నంది మేడారం విద్యార్థినులకు ఎంబీబీఎస్‌లో సీట్లు

సిరివెన్నెల

సాన శ్రీహిత

ధర్మారం, అక్టోబర్ 7: మండలంలోని నందిమేడారం గ్రామానికి చెందిన విద్యార్థినులు ఎంబీబీఎస్‌లో సీట్లు సాధించారు. నంది మేడారం గ్రామానికి చెందిన మిట్ట సంధ్య- శ్రీనివాస్ దంపతుల కూతురు సిరివెన్నెల. సిరివెన్నెల ఐదేళ్ల వయసున్నప్పుడే శ్రీనివాస్ బ్రెయిన్ ట్యూమర్‌తో చనిపోయాడు. తల్లి సంధ్య కూతురుకు చదువు చెప్పించింది. ఆమెకు బాబాయి పిన్నీ భరత్ -మమత ప్రోత్సాహాన్ని అందించారు. 2024 విద్యా సంవత్సరం విడుదలైన అప్సెట్ ఎంట్రెన్స్ లో మే 5న పరీక్ష రాయగా ఇటీవల విడుదలైన ఫలితాలలో 700 మార్కులకు గాను 519 మార్కులు సాధించింది. ఆమెకు 3,213 స్టేట్ ర్యాంకు వచ్చింది. అనంతరం కౌన్సిలింగ్ జరగా వికారాబాద్ లోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించినట్లు మిట్ట భరత్ తెలిపారు

**అదే గ్రామం నుంచి మరొకరికి**

నంది మేడారం గ్రామానికి చెందిన సాన శ్రీహిత కూడా మరో నిరుపేద కుటుంబానికి చెందిన విద్యార్థిని. తండ్రి సాన రాజేందర్ రైతు కాగా, తల్లి రజిత గ్రామంలో అంగన్వాడీ టీచర్. ఎంబీబీఎస్ కోసం హైదరాబాద్‌లో లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకుంది. ఈ ఏడాది అప్సెట్ ఎంట్రెన్స్ పరీక్ష రాయగా ఇటీవల విడుదలైన ఫలితాలలో శ్రీహిత 514 మార్కులు సాధించి స్టేట్ లెవెల్ లో 3,415 ర్యాంకును సాధించింది. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం కౌన్సిలింగ్ నిర్వహించగా నిర్మల్ లోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటును సాధించినట్లు ఆమె తల్లిదండ్రులు రజిత- రాజేందర్ తెలిపారు.

## ఆర్జీ-2 అధికారులకు స్పెషల్ ఇన్సెంటివ్

చెక్కు అందుకుంటున్న సంతోష్‌కుమార్

యైటింక్లయిన్‌కాలనీ, అక్టోబర్ 7 : సింగరేణి సంస్థ 2023-24 వార్షిక సంవత్సరంలో ఆర్జించిన లాభాల్లో స్పెషల్ ఇన్సెంటివ్ పొందిన 5గురి అధికారుల్లో ఆర్జీ-2 డివిజన్ నుంచి ఇద్దరు అధికారులు ఉన్నారు. సింగరేణి వ్యాప్తంగా మణుగూరు అడిషినల్ మేనేజర్ బీ. వెంకటేశ్వర్లు 3లక్షల 4వేలు, ఆర్జీ-2 రెస్క్యూ జీఎం కే. శ్రీనివాస్ రెడ్డి 2లక్షల 99వేలు, శ్రీరాంపూర్ ఏరియాకు చెందిన డీవైజీఎం మహమ్మద్ అబ్దుల్ ఖాదీర్ 2.99లక్షలు, శ్రీరాంపూర్ ఏరియా ఎస్ఓఎం ఈ. స్వామి రాజు 2. 94లక్షలు, ఆర్జీ-2 సేఫ్టి అధికారి ఎస్. సంతోష్ కుమార్ 2.87లక్షలు పొందగా వీరికి హైదరాబాద్‌లో సీఅండ్ ఎండీ బలరాం చెక్కులు అందజేశారు.

## రామగుండంలో బతుకమ్మ ఏర్పాట్ల టెండర్లు ఖరారు

కోల్‌సిటీ, అక్టోబర్ 7: రామగుండం నగర పాలక సంస్థ పరిధిలో ఈనెల 10వ తేదీన జరగనున్న సద్దుల బతుకమ్మ వేడుకల్లో భాగంగా ఏర్పాట్లకు సంబంధించి టెండర్లు ఖరారయ్యాయి. కార్పొరేషన్ లోని 50 డివిజన్ల పరిధిలో గల యైటింక్లయిన్ కాలనీ, గోదావరిఖని, ఎన్టీపీసీ, రామగుండం ప్రాంతాలలో మహిళలు సద్దుల బతుకమ్మ వేడుకలను ఆనందంగా జరుపుకునేందుకు ప్రతి సంవత్సరం మాదిరిగానే ఆనవాయితీలో భాగంగా ఈయేడు కూడా కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా మొత్తం 50 డివిజన్లలో డివిజన్‌కు 30 హైమాస్ట్ లైట్ల చొప్పున మొత్తం 1500 హైమాస్ట్ లైట్లను ఒకరోజు కాంట్రాక్ట్ పద్ధతిన ఏర్పాటు చేసేందుకు కార్పొరేషన్ ఇటీవల టెండర్లు పిలవగా, రూ.11 లక్షలకు ఇద్దరు కాంట్రాక్టర్లు ఆ పనులను దక్కించుకున్నారు. మరో రెండు రోజుల్లో నగరంలోని అన్ని డివిజన్లలో బతుకమ్మ వేడుకలు జరిగే ప్రాంతాలను గుర్తించి అక్కడ హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

## ఓదెల-2 సినిమా షూటింగ్ సందడి

ఓదెల, అక్టోబర్ 7: ప్రముఖ సినీ దర్శకుడు సంపత్ నంది నిర్మిస్తున్న ఓదెల -2 చిత్ర బృందం రెండు రోజులుగా ఓదెలలో సందడి చేస్తుంది. ఓదెల గ్రామంతో పాటు స్థానిక రైల్వే స్టేషన్, మల్లికార్జునస్వామి ఆలయంలో హీరోయిన్ తమన్నా పై పలు సన్నివేశాలు చిత్రీకరించారు. హీరోయిన తమన్నా వచ్చిందని తెలియడంతో ఓదెల పరిసర గ్రామాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. పొత్కపల్లి, కాల్వశ్రీరాంపూర్ పోలీసులు షూటింగ్ సందర్భంగా బందోబస్తునిర్వహిస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ కాశీలో ప్రారంభమై చివరి దశకు చేరినట్లు తెలిపారు. మొదటి పార్ట్ కంటే ఓదెల-2 మరింత థ్రిల్లింగ్‌గా ఉండబోతుందన్నారు. ఈ చిత్రంలో తమన్నాతో పాటు హెబ్బా పటేల్, వశిష్ట ఎన్ సింహా ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. కాంతార ఫేమ్ అజనీష్ లోక్‌నాథ్ సంగీతం అందిస్తున్నారు.

### కాంట్రాక్ట్ కార్మికుల బోనస్‌ను త్వరగా చెల్లించాలి

గోదావరిఖని, అక్టోబర్ 7: దసరా పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో బిల్లులతో సంబంధం లేకుండా సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు యాజమాన్యం వెంటనే లాభాలవాటా బోనస్‌ను చెల్లించాలని తెలంగాణ కాంట్రాక్ట్ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మద్దెల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం ఓసీపీ 3 ఫేస్ 2లో జరిగిన కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి కాంట్రాక్ట్ కార్మికుడికి ఈ నెల7వ తేదిన చెల్లించనున్న రూ.5వేల బోనస్‌ను వెంటనే వారి బ్యాంకుఖాతాలో జమచేయాలన్నారు. ఇక్కడ నాయకులు రాసకట్ల భాస్కర్, కమటం సందీప్, శ్రీకాంత్, బూడిద మహేందర్, పాష, తదితరులు ఉన్నారు.

### దుర్గామాత సన్నిధిలో కౌశికహరి పూజలు

గోదావరిఖని, అక్టోబర్ 7: దుర్గామాత నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకోని సోమవారం అంతర్గాం మండలం పొట్యాల గ్రామంలో గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత సన్నిధిలో బీఆర్ఎస్ నాయకులు కౌశికహరి-లత దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. నియోకవర్గ ప్రజలు సుఖంసంతోషాలతో వర్ధిల్లాలని, వారి జీవితాలు వెలుగులు ప్రసాదించాలని వారు అమ్మవారికి చండీయాగం హోమం చేశారు. ఇక్కడ కౌశిక భరత్, బొండ్ల అశోక్, గాలేంకి ప్రసాద్, నిమ్మరాజుల రవి, దారంగుల కుమార్, పులి శ్రీనివాస్, ఒల్లెపు మల్లేశ్, బోనగరి కుమార్, యాదండ్ల అర్జున్ ఉన్నారు.

### జిల్లా గ్రంథాలయ కార్యదర్శిగా కరుణ కుమారి

పెద్దపల్లి కమాన్, అక్టోబర్ 7 : పెద్దపల్లి జిల్లా గ్రంథాలయ కార్యదర్శిగా కరుణ కుమారి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో గ్రంథాలయ కార్యదర్శిగా పని చేసిన ఏవీఎన్ రాజు ఉద్యోగ విరణమ పొందగా, ఆయన స్థానంలో కరుణకుమారికి బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఆమెకు సిబ్బంది, పాఠకులు స్వాతగం పలికారు. గ్రంథాలయంలో కరుణకుమారిని జూనియర్ అసిస్టెంట్ గఫార్, సిబ్బంది సన్మానించి జ్ఞాపిక అందజేశారు. ఇక్కడ గ్రంథాలయ జూనియర్ అసిస్టెంట్ గఫార్, సిబ్బంది యూనుస్ ఖాద్రి, సీహెచ్. స్వరూప, నాగభూషణం, మౌళి మస్తాన్, బి. సంపత్, భారతి, దీప తదితరులున్నారు.

### బీజేపీ సభ్యత్వ నమోదు

గోదావరిఖని, అక్టోబర్ 7: బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పిడుగు కృష్ణ ఆధ్వర్యంలో సోమవారం గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి బీజేపీ నియోకవర్గ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మెరుగు హన్మంత్‌గౌడ్ హాజరయ్యారు. ఇక్కడ నాయకులు క్యాతం వెంకటరమణ, జక్కుల నరహరి, గుండెబోయిన భూమయ్య, గోపగాని నవీన్‌గౌడ్, కొమ్ము గట్టయ్య, కొడూరి రమేశ్, కొండపర్తి సంజీవ్, అందే రాజ్‌కుమార్, మామిడి వీరేశం, బుంగ మహేశ్, జక్కుల ప్రవీణ్, తదితరులు ఉన్నారు.

### పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ముత్తారం, అక్టోబర్ 7: ప్రజలు తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో సురేశ్ సూచించారు. ముత్తారం పంచాయతీలో సోమవారం పర్యటించారు. ఇక్కడ కార్యదర్శి నరేశ్ పాల్గొన్నారు.

లాభాల బోనస్ పంపిణీలో మంత్రులతో రామగుండం ఎమ్మెల్యే

## గని కార్మికులను అన్ని విధాలుగా ఆదుకుంటాం

గోదావరిఖని, అక్టోబర్ 7: సింగరేణి కార్మికులను అన్ని విధాలుగా అదుకుంటామని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్ పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని మహాత్మజ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో సోమవారం జరిగిన సింగరేణి కార్మికులకు 33శాతం లాభాల బోనస్ చెక్కుల పంపిణీలో రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కార్మికులకు అందజేసిన బోనస్ పంపిణీలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణి కార్మికులకు వెన్నుదన్నుగా ఉంటుందని, వారి సమస్యలపై పరిష్కారంలో ముందున్నదన్నారు. మొదటి సారిగా సింగరేణిలో కాంగ్రెస్ ప్రభుత్వం కాంట్రాక్ట్ కార్మికులకు కూడ రూ.5వేల చోప్పున లాభాల బోనస్‌ను అందించిందని తెలిపారు.

### సింగరేణి అగ్రగామి లక్ష్యం

గోదావరిఖని, అక్టోబర్ 7: సింగరేణిని అగ్రగామిగా నిలపడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. సోమవారం హైదరాబాద్‌లో సింగరేణి ఉద్యోగుల రూ. 796 కోట్ల లాభాల వాటా పంపిణీలో ఆయన మాట్లాడారు. సింగరేణి అభివృద్ధి, సంక్షేమానికి కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. విదేశ కంపెనీలతో సింగరేణి ఉమ్మడి భాగస్వామ్యం, నూతన రంగాల్లో ప్రవేశం, సింగరేణి ఖాళీ ప్రదేశాల్లో గ్రీన్ ఎనర్జీ ప్లాంట్లు, అలాగే సింగరేణి ప్రాంతాల్లోని నియోకవర్గానికి ఒకటి చొప్పున యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల ఏర్పాటు, అత్యాధునిక వైద్యసేవల కోసం సూపర్ స్పెషాలిటీ దవాఖానల ఏర్పాటు ధ్యేయంగా ముందుకు సాగనున్నట్లు డిప్యూటీ సీఎం పేర్కొన్నారు.

## ఓసీపీ 5లో అమ్మవారికి బోనాలు

అమ్మవారి సన్నిధిలో మహిళల ఆటాపాట

గోదావరిఖని, అక్టోబర్ 7: దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఆర్జీ-1 పరిధి ఓసీపీ 5లో అమ్మవారి విగ్రహ సన్నిధిలో బోనాల పండుగ నిర్వహించారు. రామగుండం ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఆయన సతీమణి మనాలి ఠాకూర్ ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారి బోనమెత్తుకున్నారు. అనంతరం పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఇక్కడ కాంగ్రెస్ పార్టీ అనుబంధ ఐఎన్టీయూసీ నాయకులు, కార్పొరేటర్లు, సింగరేణి అధికారులు పాల్గొన్నారు.

### పరామర్శ

జూలపల్లి, అక్టోబర్ 7 :కాచాపూర్ గ్రామానికి చెందిన బత్తిని లింగయ్యగౌడ్ అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందాడు. ఈ క్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్ సోమవారం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా 'నేనున్నా' స్వచ్ఛంద సేవా సంస్థ తరపున బియ్యం అందజేశారు. ఇక్కడ నాయకులు బత్తిని దామోదర్, అమరగాని పురుషోత్తం, పొన్నం శ్రీనివాస్, పాలకుర్తి రాజవీరు, బత్తిని వామన్, బత్తిని హరికృష్ణ ఉన్నారు.

## అదంతా తప్పుడు ప్రచారమే

- **విద్యుత్ సామగ్రి స్టోర్ రూంలో భద్రపరిచాం**
- **రామగుండం ఇన్‌చార్జి కమిషనర్ స్పష్టీకరణ**

కోల్‌సిటీ, అక్టోబర్ 7: రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో విద్యుత్ ఉపకరణాలు మళ్లించినట్లు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదనీ, కొన్ని విద్యుత్ సామగ్రిని స్టోర్ రూంలో భద్రపరిచామని ఇన్‌చార్జి కమిషనర్ సోమవారం ప్రకటనలో స్పష్టం చేశారు. ఇటీవల నమస్తే తెలంగాణ దిన పత్రికలో 'రామగుండం బల్దియాలో విద్యుత్ ఉపకరణాల మళ్లింపు' శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించి విచారణ చేపట్టారు. కార్యాలయంలోని రెండు ఏసీలను మరమ్మతుల కోసం కాంట్రాక్టర్ తిరుపతికి అప్పగించగా ఒకటి మరమ్మతులు చేసి తిరి అప్పగించారనీ, మరొకటి విడిభాగాలు అందుబాటులో లేనందున ఆలస్యం జరుగుతుందని తెలిపారు. అలాగే కంటి వెలుగు శిబిరం సందర్భంగా కొనుగోలు చేసిన 36 స్టాండ్ ఫ్యాన్లలో 20 ఫ్యాన్లను స్టోర్ రూంలో భద్రపరిచి మిగతా 16 ఫ్యాన్లను వివిధ విభాగాల్లో బిగించామని తెలిపారు. కార్యాలయంలోని ఎలక్ట్రికల్ పరికరాలు అన్ని తమ ఆధీనంలోనే ఉన్నాయని తెలిపారు.

### సీఈఐఆర్ పోర్టల్‌తో 20 సెల్‌ఫోన్ల రికవరీ

పెద్దపల్లి రూరల్, అక్టోబర్ 7: పెద్దపల్లిలో వివిధ కారణాలతో పలువురు కోల్పోయిన 20 సెల్‌ఫోన్‌లను సీఈఐఆర్ పోర్టల్‌తో రికవరీ చేసి బాధితులకు అప్పగించినట్లు ఎస్ఐ లక్ష్మణ్ రావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడారు. సెల్‌ఫోన్లు పోయాయని పలువురినుంచి వచ్చిన ఫిర్యాదులపై విచారణ జరిపి సీఈఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేసి బాధితులకు అప్పగించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

### సదస్సును జయప్రదం చేయండి

పెద్దపల్లి టౌన్, అక్టోబర్ 7 :తెలంగాణ ప్రజా ఫ్రంట్ 15వ, ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని ఈనెల 9న నిర్వహించతలపెటిటన సదస్సును జయప్రదం చేయాలని జిల్లా కన్వీనర్ గుమ్మడి కొమురయ్య కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్తూపం ఎదుట సదస్సు కర పత్రాలు విడుదల చేశారు. ఇక్కడ ప్రజా సంఘాల నాయకులు మాదన కుమారస్వామి, గాండ్ల మల్లేశ్, నారా వినోద్, బాలసాని రాజయ్య, రామిల్ల బాపు, వెల్తురు సదానందం, బొంకూరి లక్ష్మణ్, బూపెల్లి సుధాకర్, దుర్గం లింగయ్య, ముడిమడుగుల మల్లయ్య, ఎరుకల రాజయ్య, పులిపాక రవీందర్ పాల్గొన్నారు.

### వకీలుపల్లి గనిలో ఎలక్ట్రికల్ డీఎంఎస్ పర్యటన

మ్యాప్‌ను పరిశీలిస్తున్న డీఎంఎస్

యైటింక్లయిన్‌కాలనీ, అక్టోబర్ 7 : సింగరేణి సంస్థ ఆర్జీ-2 పరిధిలోని వకీలుపల్లి గనిలో సోమవారం ఎలక్ట్రికల్ డీఎంఎస్ రాజీవ్‌ఓం ప్రకాష్ వర్మ పర్యటించారు. ప్రాజెక్టు అధికారి నెహ్రూతో కలిసి ఏజెంట్ కార్యాలయంలో గని పని స్థలాలు, విద్యుత్ రక్షణ సూత్రాల అమలు తదితర అంశాలపై మ్యాప్ ద్వారా పరిశీలించారు. ఆనంతరం గనిలోకి దిగి కంటిన్యూస్‌మైనర్, ఎల్‌హెచ్‌డీ యంత్రం పనితీరును పరిశీలించి విద్యుత్ సరఫరా, రక్షణ సూత్రాల అమలు పరిశీలించి పలు సూచనలు చేశారు. భూగర్భ గనుల్లో విద్యుత్ సరఫరాలో ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటు రక్షణసూత్రాలు అమలు చేయాలని సూచించారు. ఆయన వెంట గని మేనేజర్ పీ. రవికిరణ్, సేఫ్టి అధికారి అశోక్ కుమార్, ఇంజనీర్ శేఖర్, ఎలక్ట్రికల్ డీజీఎం ఎర్రన్న తదితరులు పాల్గొన్నారు.